

# మనుషుల కథ పిల్లినే అడగాలి

పట్నవాసం చేసిన పిల్లి చాలారోజుల తర్వాత చుట్టాల్నీ పక్కాల్నీ చూసి పోదామని అడవికి బయలుదేరింది.

తల మీద పైట కప్పుకుని, వంటికి దుప్పటి చుట్టుకొని, నోటికి ఆకువక్క వేసుకొని ఖరీదాగా ఖాయిదాగా అడవిలోకి వస్తున్న పిల్లిని చూసి ఎదురుగా వస్తున్న తోడేలు 'సలాములేకుమ్ ఖాలాబీ (పెదమ్మా)' అని సలాము చేసింది.

'వాలేకుం సలామ్ నాయనా. ఎలా ఉన్నావు?' అని అడిగింది పిల్లి.

'ఏదో అట్టట్ట ఉన్నాములే పెదమ్మా. నువ్వు ఎలా వున్నావో చెప్పు. చాన్నాళ్ల తర్వాత మాబోటి వాళ్లని దారి తప్పి చూడ్డానికి వచ్చావు. నీకేమి? పట్నవాసంలో పాలకూడు, పెరుగుకూడు తినే భోగం. నౌకర్లు, చాకర్లు ఉంటారు. నీకు ఏది కావాలంటే అది నిన్ను పెంచుకునేవాళ్లు అందిస్తారు. అది కదా బతుకంటే. మాకూ ఉంది బతుకు. దేనికి? పురుగూ పుట్రా తిని చచ్చిన గొడ్డూ బతికిన పిట్టా నమిలి హీనపు బతుకు బతుకుతున్నాము. మనుషులు మమ్మల్ని దగ్గరకు తీస్తే గదా. మీ పిల్లిజాతి పెట్టి పుట్టిందమ్మా' అన్నది తోడేలు కడుపులోని అక్కసంతా తీర్చుకుంటూ.

'ఒహోహో. బాగా చెప్పావు. నీకేమి తెలుసు నాయనా పట్నవాసం సంగతి. మనుషుల సంగతి' అని, బొడ్లో నుంచి సంచి తీసి ఆకువక్కని మళ్లా నోట్లో వేసుకుంది పిల్లి.

'అదేమిటి పెదమ్మా అలా అంటావు. మనుషుల గురించి మేమంతా కథలు కథలుగా చెప్పుకుంటామే. వాళ్లు చాలా గొప్పోళ్లంటగదా. మంచీ శబరా పాపం పుణ్యం ఎరిగిన వాళ్లంట గదా. ఈ భూమండలాన వాళ్లను మించినవాళ్లు లేరంట గదా' అంది తోడేలు.

'ఎవరు నాయనా నీకు చెప్పింది. వాళ్లకు ఒక మంచి తెలియదు. ఒక చెడ్డ తెలియదు. నా సంగతే తీసుకో. వాళ్ల నోళ్లలో పడ్డాక నా బతుకు బతుకు కాదు. ఎంతసేపటికీ నన్ను 'పిల్లిముండా' 'పిల్లిముండా' అని పిలుస్తారు గానీ పిల్లి అని ఒక్కరు కూడా పిలవరు. యింట్లో ఏ ఒక్క పాలు పోయినా, ఏ ఒక్క పెరుగుపోయినా, ఉట్టినగట్టిన ఏ ఒక్క ఎండుచేప పోయినా 'యింకేముంది పిల్లిముండ తినేసుంటుంది. పిల్లిముండ కాజేసుంటుంది' అని నన్ను ఆడిపోసుకుంటారు. నేను తిన్నానా లేదా యిది సత్యమా కాదా అని ఎవ్వరూ విచారించరు. విచారించకపోతే పోయారు యీ 'ముండ' అనే పిలుపు ఏంది? ఏం? మాకు పెళ్లిళ్లు కావా? మేము ముత్తయిదువులుగా కాపరాలు చేసుకోవడం లేదా? పిల్లల్ని కనడం లేదా? ఎంతసేపటికీ 'ముండా' 'ముండా' అని తిట్టడమే...



'సరే అదట్టాపోనీ. నన్ను పెంచుతారు. పెంచినచోట పరిశుభ్రంగా ఉంచాలా వద్దా? ఉంచరు. ఆ గడ్డి పెంచుతారు. ఈ గాదం పెంచుతారు. అటకల మీద' మూల గదుల్లో చెత్తాచెదారం పోస్తారు. పోస్తే ఎలుకలు చేరతాయి గదా. వాటిని తినమంటారు. నేను తింటాను. పాపం ఆ ఎలుక ఏం చేసింది. అది కూడా నాలాగా నాలుగుకాళ్ల జీవే. ఒక నాలుగు కాళ్ల జీవిని మరో నాలుగుకాళ్ల జీవి తినడం ఎంత పాపం. ఆ పాపాన్ని నా చేత చేయిస్తున్నారే ఈ మనుషులది యింకెంత పాపమోకదా' అంది పిల్లి.

తోడేలు ఆ అని నోరు తెరుచుకొని చూస్తోంది.

'నాయనా. నువ్వు నిజం అనుకో అబద్ధం అనుకో. తిండి మీద నాకు యావ లేదు. అది పాలా పెరుగా పలావా అనేది చూడను. కళ్లు మూసుకొని తినేస్తాను. తాగేస్తాను. అట్లా చేయడం వల్ల ఆ వస్తువు నా కొరకు ఉంచిందో యితరుల కొరకు వుంచిందో నాకెలా తెలుస్తుంది. అట్లా తెలియక చేసిన తప్పుని తెలిసి చేసిన తప్పుగా మాట్లాడుతారు మనుషులు. పైగా నేను యింటిని అంటిపెట్టుకుని వుంటే మొరగడం కరవడం తప్ప యింకేమీ చేతగాని కుక్కకి విశ్వాసం అంటగడతారు. వీళ్లు భలే కఠినాత్ములబ్బా' అంది పిల్లి.

‘అరె. యివన్నీ మాకు తెలియదు పెదమ్మా’ అంది తోడేలు.

‘అసలైనది చెబుతా చూసుకో. నువ్వెవరివి? తోడేలువి. నేనెవరిని? పిల్లిని. మనం ఏనాడైనా ఒక తోడేలు యింకో తోడేలుని, ఒక పిల్లి యింకో పిల్లిని చంపుకోవడం చూశామా? ఆఖరికి ఒక సింహం యింకో సింహాన్ని చంపడం చూశామా? ఈ మనుషులు అలా కాదు నాయనా. ఒక మనిషి యింకో మనిషిని చంపుతాడు. ఒక మనిషి యింకో మనిషిని దోచుకుంటాడు. ఒక మనిషి యింకో మనిషిని పీడిస్తాడు. ఒకడు మంచి చేస్తే యింకొకడు దాన్ని చెడ్డ అంటాడు. ఒకడు చెడ్డ చేస్తే యింకొకడు దాన్ని యింకాస్త చెయ్యి అంటాడు. అట్టాంటి రెండుకాళ్ల హీనపు జాతి నాయనా అది. అట్టాంటి జాతి చేతుల్లో పడని మీ తోడేళ్లు ఎంతో అదృష్టవంతులు’ అని, లేచి బంధువులను కలవడానికి వెళ్లిపోయిందంట ఆ పట్నవాసపు పిల్లి.